క్లుప్తంగా

పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

సదుం: పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని పచ్చార్లమాకులపల్లెలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త రెడ్డెప్పరెడ్డి గృహానికి మంగళవారం మంత్రి విచ్చేశారు. పలువురు నాయకులు ఆయనను కలిశారు. వారితో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, హేమచంద్రారెడ్డి, తేజారెడ్డి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు 'వై ఏపీ నీడ్స్ జగన్'పై శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై బుధ, గురువారాల్లో గ్రామ స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సి.నాదమునిరెడ్డి తెలిపారు. 25న మతుకువారిపల్లె, వెంకట దాసరపల్లె, దిగువ పోకలవారిపల్లె, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, దేవళం పేట, కల్లూరు 26న కమ్మపల్లె, పులిచెర్ల, గడ్డం వారిపల్లె, మంగళంపేట, ఎల్లంకివారిపల్లె, రాయవారిపల్లె, కావేటిగారిపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

శివాలయంలో చోరీకి యత్నం



రొంపిచెర్ల: రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయంలో దొంగలు పడ్డారు. ఆదివారం హుండీ తాళాలు కోసి చోరీకి విఫలయత్నం చేశారు. ఆల్యసంగా ఇది వెలుగులోకి వచ్చింది. మనుషులు సంచరిస్తుండడంతో అలాగే హుండీని వదిలేసి వెళ్లి పోయారు. ఇది గమనించిన భక్తులు సమాచారం ఇవ్వడంతో ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ సోమవారం ఆలయాన్ని పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు వాటిని ఆఫ్ చేసి చోరీకి యత్నించినట్టు చేసినట్లు తెలిసింది. ఎస్ఐ కృష్ణయ్య ఆలయాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగి మృతిపై ఆందోళన



మాణిక్యంకు సీపీఆర్ చేస్తున్న స్టాఫ్ నర్స్

రామకుప్పం: రోగి మృతిపై బంధువులు ఆందోళన చేసిన సంఘటన మంగళవారం రాత్రి స్థానిక పీహెచ్‌సీ వద్ద చోటుచేసుకుంది. వివరాలు..మేజర్ పంచాయతీ రామకుప్పంలోని మిట్టపల్లెకు చెందిన మాణిక్యం(80) అనారోగ్యానికి గురవడంతో అతడిని మంగళవారం రాత్రి చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. చికిత్సపొందుతూ మాణిక్యం ఆస్పత్రిలో మృతిచెందాడు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మాణిక్యం మృతి చెందాడని ఆరోపిస్తూ మాణిక్యం బంధువులు ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేశారు. ఈ విషయమై వైద్యాధికారిణి దీపను వివరణ కోరగా.. మాణిక్యంను తీసుకుని వచ్చిన వెంటనే స్టాఫ్ నర్స్ సీపీఆర్ చేశారని, అయితే కార్డియాక్ అరెస్ట్ కారణంగా అతడు మృతి చెందినట్లు స్పష్టం చేశారు.

ఈరోజు

వైఎస్సార్ సీపీ సమావేశం

సదుం: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో పార్టీ ప్రముఖులు పాల్గొని 'ఏపీకి జగన్ అవసరం ఎందుకంటే' కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

సోమలలో..

సోమల: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై స్థానిక సినిమా క్రాస్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి పాల్గొని విధి విధానాలను తెలియజేస్తారని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ రహీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని కమ్మపాళ్యం సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియోజకవర్గ స్థాయి టెన్నికాయిట్ పోటీలు

సోమల: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గ స్థాయిలో అండర్-17, అండర్-14 విభాగాల్లో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలు రామచంద్ర, కరుణానిధి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలియజేశారు.

ఘనంగా దసరా వేడుకలు



పలమనేరు: మహిషాసుర మర్దినిగా అమ్మవారు



గంగవరం: మేలుమాయి క్రాస్‌లో..



పెద్దపంజాణి: మహిషాసుర మర్దిని అలంకారంలో దుర్గమ్మ



పుంగనూరు: మదనపల్లెలో సాయిబాబా విగ్రహం



రొంపిచెర్ల: విశేష అలంకరణలో ముత్యాలమ్మ



పలమనేరు : టెర్రకోట కాలనీలో కోలాట ప్రదర్శన

పలమనేరు: పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతపేట, సత్యగంగమ్మ, ఎద్దులసంతవీధి టెర్రకోట వినాయక స్వామి ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని మార్వాడీలు దుర్గామాత వేడుకలను ఘనంగా నిర్వహించారు. టెర్రకోట కాలనీలో మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, స్థానికులు హాజరయ్యారు.

మేలుమాయి క్రాస్‌లో..

గంగవరం: మండలంలో మేలుమాయి క్రాస్‌లోని శ్రీమలాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం పరిసమాప్తమయ్యాయి. చివరిరోజు అమ్మవారిని మహిషాసురమర్దిని అవతారంలో అలంకరించి ఘనంగా పూజలు చేశారు. కుంకుమార్చన, హోమాది, కంకణధార, నిత్యపూజా కైంకర్యాల అనంతరం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, వెంకటరమణ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



కుప్పం: గుండ్లసాగరంలో.. మహిషాసురమర్దినిగా దుర్గమ్మ



కుప్పం రూరల్ : పెద్ద బంగారునత్తంలో.. వైభవంగా విజయదశమి పూజలు

పెద్దపంజాణి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన సోమవారం మండలంలోని శంకర్రాయలపేట దొరచెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు నాగరాజ గురుకుల్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జయభారతి, నాగేష్ రెడ్డి, ఆషా, విశ్వనాథ రెడ్డి, ధనలక్ష్మి తదితరులు ఉభయదారులుగా వ్యవహరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుంగనూరు: నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన మంగళవారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయిబాబా సమాధిలోకి ప్రవేశించిన రోజు కావడంతో మాదనపల్లెలోని సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి హోమ పూజలు చేశారు. అలాగే పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న సాయిబాబా ఆలయం, దత్తాత్రేయ ఆలయం, కొత్త ఇండ్లులోని సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజార్చనలు చేశారు. భక్తులు సాయి పారాయణం చేశారు. అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దక్షిణామూర్తి, త్రిమూర్తి రెడ్డి, టీపీఎస్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలో దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ , కట్టకింద శివాలయం, నడింపల్లె చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాల్లో ఉభయదారులు తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. దాతలు ఆలయాల్లో అమ్మవారికి నగలను సమర్పించడమే కాకుండా అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

కుప్పంలో..

కుప్పం: స్థానిక శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ, పెద్దపల్లి గంగమ్మ, శ్రీ వాసవి కన్యకపరమేశ్వారి దేవాలయాల్లో సోమవారం నవరాత్రి ముగింపు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పట్టణ సమీపంలో గుత్తార్లపల్లెలోని శ్రీ తిమ్మరాయస్వామి, అగ్నిమారెమ్మ దేవాలయాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గుండ్ల సాగరం అగ్నిమారెమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా పంచామృత అభిషేకం నిర్వహించి అలంకరించారు.

సీతారాముల ఊరేగింపు

కుప్పం రూరల్: మండలంలోని పెద్ద బంగారునత్తం శ్రీరామాలయంలో స్వామి వారిని జంబు సవారీ చేయించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గంగాపురమ్మ ఆలయ పూజల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే

సదుం: విజయ దశమి సందర్భంగా మండలంలోని పచ్చార్లమాకులపల్లె గంగాపురమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. సదుంలోని సాయి మందిరంలో నిర్వాహకులు పూజలు, అన్నదానం చేశారు. ఎర్రాతివారిపల్లె సదుమమ్మ ఆలయం, రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ, జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజా కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐకమత్యంతో ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బోడిగుట్ల పంచాయతీ దొడ్డిపల్లెలో ఇరువర్గాల నడుమ ఏళ్ల తరబడి పలు సమస్యలతో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సామరస్యంగా పరిష్కరించారు. మంగళవారం సీసీరోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో జెడ్పీ చైర్మన్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ యువరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శిస్తే గుణపాఠం చెబుతాం

పుంగనూరు: అర్హత లేకున్నా స్థాయి మరచి మహాసేన యూట్యూబ్ చానల్‌లో రాజేష్ తన స్థాయి మరిచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతామని దళిత నేతలు రాజు, శంకరప్ప,కృష్ణప్ప, చెన్నరాయుడు హెచ్చరించారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడారు. బడుగు, బలహీనుల వర్గాలకు అగ్ర స్థానం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎంను విమర్శిస్తే రాజేష్‌ను వదిలిపెట్టేది లేదన్నారు. పోలీసులకు రాజేష్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు మార్లపల్లె కృష్ణప్ప, అశోక్‌కుమార్, జనార్దన్, గంగప్ప, రామమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసింది

- ఏపీసీసీ రాష్ట్ర చైర్మన్ తులసిరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ మాట తప్పి మోసం చేసిందని ఏపీసీసీ రాష్ట్ర చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పోటుగారి భాస్కర్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బీజేపీ పంగనామం పెట్టిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం స్వస్తి పలికిందని విమర్శించారు. విశాఖ, విజయవాడల్లో మెట్రో ప్రాజెక్టు అమలు చేయలేదన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, 13 కేంద్రీయ సంస్థలు నత్తనడకన సాగుతున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి వద్ద ఉన్న మన్నవరం ప్రాజెక్టును కేంద్రం మూసివేసిందన్నారు. బీజేపీ ఏపీకి తీరని ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. పార్టీ నేతలు టిక్కిరాయల్, ధనంజయనాయుడు, పరదేశి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న భాస్కర్

కళాతరంగిణి విద్యార్థుల ప్రతిభ



శిల్పారామంలో కళాతరంగిణి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న మునిరాజు

బైరెడ్డిపల్లె: దసరా పురస్కరించుకుని కడపలోని శిల్పారామంలో రాష్ట్ర పర్యాటక శాఖ సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక మేళాలో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ విద్యార్థులు తమ కళాప్రతిభ చాటి ప్రశంసలందుకున్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించి హర్షిత, జనని, ప్రవల్లిక, పళని, రాజు, పవిత్ర, కరుణశ్రీ, సువర్ణ, భవ్యశ్రీ, ఉష, మానసను శిల్పారామం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మునిరాజు, ఏఓ శివప్రసాద్, ఆర్గనైజర్ పద్మాకర్‌రావు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాతరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, మస్తాన్‌వలీ, జయచంద్ర, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

భాషా పోటీల విజేతలు వీరే!

పలమనేరు: పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పదకొండో వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన భాషా పోటీల విజేతల వివరాలను ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మంగళవారం వెల్లడించారు. వ్యాసరచన పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన సాయి జైరెడ్డి, వెంకట విహాస్, సుశాంక్, విగ్రత్, అక్షిత్, చిత్తూరుకు చెందిన ప్రతిభ, పలమనేరుకు చెందిన చందు, నాగభానుశ్రీ, విశాల్, ఖాసియా అంజుం, ఉమర్, ప్రజ్ఞత్, రోహిత, తేజశ్రీ తదితరులు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే చిత్రలేఖన పోటీల్లో మరో పది మంది వరకూ విజేతలుగా నిలిచారని, వీరికిను ఈనెల 29న వార్షికోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

శిఖండి షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: చిత్తూరులో సోమవారం శిఖండి చిత్ర షూటింగ్‌ను ప్రారంభించారు. మిట్టూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు.

రథోత్సవం..రమణీయం



తీర్థంలో నిర్వహిస్తున్న రథోత్సవంలో భక్తులు

బైరెడ్డిపల్లె: శరవన్నరాత్రి ఉత్సవాలు మంగళవారం అంగరంగవైభవంగా ముగిశాయి. తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మ రథంపై రామచంద్రస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, బాటగంగమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారు కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం నిజరూపదర్శనంలో భక్తులను అనుగ్రహించారు.



కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులు అందుకున్న విద్యార్థులతో దాత, నిర్వాహకులు

సదుం: మండలంలోని గాదేవారిపల్లె, ఎస్టీ కాలనీకి చెందిన పలువురు నిరుపేద విద్యార్థులకు దుస్తులను అందజేసినట్టు మాతృసేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. పేద విద్యార్థులు బడి మానేయకుండా సదుం, పాకాల, ఐరాల మండలాల పరిధిలో ప్రతి ఏటా ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. 90 ప్యాంట్లు జయచంద్ర నాయిని వితరణ చేశారని కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో రామ్మూర్తి, గోపాల్, ధనుంజయులు, ప్రశాంతి, చిన్నబ్బ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు విచ్చేయండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్, సభ్యులు

కాణిపాకం(యాదమరి): పాకాల మండలం ఊట్లవారిపల్లెలో కొత్తగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహావిష్కరణకు విచ్చేయాలని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశును సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ పట్టాభిరెడ్డి, ఆలయ బోర్డు సభ్యులు కోరారు. మంగళవారం ఊట్లవారిపల్లె ఆలయ చైర్మన్, బోర్డు సభ్యులు కాణిపాకం విచ్చేశారు. నవంబర్ 1న నూతనంగా నిర్మించిన 54 అడుగుల నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, తప్పక రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు.

క్రీడాకారుల్లో రెట్టించిన ఉత్సాహం



క్యాంప్ ఫైర్ కార్యక్రమంలో క్రీడాకారులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 8వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం రాత్రి ఫైర్ క్యాంప్‌ను కోలాహలంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా క్యాంప్ ఫైర్‌లో క్రీడాకారులతో కలిసి సందడి చేశారు. తానూ క్రీడాకారిణినేనంటూ కాలేజీ డేస్‌ను నెమరువేసుకుంటూ మంటల చుట్టూ క్రీడాకారులతో కలిసి నృత్యం చేశారు. దీంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మంత్రి మాట్లాడుతూ వరుసగా క్రీడల్లో పాల్గొని అలసిపోయిన విద్యార్థుల్లో కొత్త జోష్ నింపడానికే టోర్నమెంట్లలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఇది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. అప్పటివరకు జరిగిన పోటీల్లో గెలుపోటములు మరచి అంతా మంచి స్నేహితులమనే భావన పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమం అనంతరం రాష్ట్ర, జిల్లా, నగరి బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులను ఆమె దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.